క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణ వేదికపై కొలువైన నరసింహ స్వామి, లక్ష్మీదేవి అమ్మవారు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి రెండవ శ్రావణ శనివారం సందర్భగా ఆలయ ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. ముందుగా ఉదయం స్వామి వారికి గణపతిపూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకొని కల్యాణాన్ని తిలకించారు.

అంజన్నకు శ్రావణమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో తూర్పు ఆంజనేయస్వామి

పులివెందుల టౌన్ : శ్రావణ మాస రెండవ శనివారం సందర్భంగా అంజన్న ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం, పీడబ్ల్యూ కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయం, కోతి సమాధి ఆలయం, పాత మార్కెట్ పడమటి ఆంజనేయస్వామి, ఆర్‌ఆర్ లేఔట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఘనంగా వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గోపూజ, వాస్తుహోమం, ఆలయ ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట, స్వామి వారి గ్రామోత్సవం, చెక్కభజన, 19వ తేదీ సోమవారం ఉదయం 4.40గంటల నుంచి యంత్ర ప్రతిష్ట, స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న కంటి పరీక్షల వైద్యుడు సుధాకర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కంటి వైద్య నిపుణులు సుధాకర్‌రెడ్డి అన్నారు. పౌష్టికాహారంతోనే దృష్టిలోపం లేని సమాజం సాధ్యమని తెలిపారు. శనివారం పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ బాలికల వసతి గృహంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటిచూపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వసతిగృహం ప్రిన్సిపాల్ హరిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలంటే కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ అంధత్వ నివారణ సంస్థ నిర్వహిస్తున్న కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్నేహితఅమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఏఎన్‌ఎం సుజాత, ప్రేమలత, ఆశాకార్యకర్త సావిత్రి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై జేసీకి వినతి



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న రామచంద్రారెడ్డి

చక్రాయపేట : మండలంలోని రైతు సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం సమర్పించినట్లు బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలో కాలేటి వాగు ప్రాజెక్టు పనులు సత్వరం పూర్తి చేసి చెరువులన్నింటికీ నీరందించాలని కోరారు. భూసమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

మిన్నంటిన నిరసనలు



చక్రాయపేట: విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



జమ్మలమడుగు: మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

పులివెందుల రూరల్ : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ మెడికల్ కళాశాల సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. పులివెందులలో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి దాడులను సహించేది లేదని, దాడులకు పాల్పడకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని మాండ్ చేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలకేంద్రంలోని కోల్‌కతాలోని మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

తొండూరులో..

తొండూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోల్‌కతాలో జరిగిన మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా వైద్యులు హరీఫుల్లా, రేష్మా, హెల్త్‌ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆశావర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం చేసి హత్యచేసిన మానవ మృగాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాగలగుట్టపల్లెలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురభి వైద్యాధికారి శివప్రసాద్, కంటి వైద్యుడు రెడ్డెన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవకుమార్, ఆస్పత్రి ఇబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కమలాపురం : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అమానుషంగా ప్రవర్తించి హత్యకు కారకులైన వారిని కఠినగా శిక్షించాలని స్థానిక సీహెచ్‌సీ ఇన్‌చార్జి తాజుద్దీన్ డిమాండ్ చేశారు. శనివారం కమలాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ప్రాణాలు పోసే వైద్యులపై ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డ ఘటనను నిరసిస్తూ మండల కేంద్రమైన వల్లూరులో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పీహెచ్‌సీ వద్ద నుంచి గాంధీ కూడలి వరకు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వేణు గోపాల్ , హెల్త్ సూపర్ వైజర్‌లు సుధాకర్, మమత, స్టాఫ్ నర్సులు పెర్సి, అనిత, 108 సిబ్బంది సునీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

వీరపునాయునిపల్లె : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అమానుషంగా ప్రవర్తించి హత్యకు కారకులైన వారిని కఠినగా శిక్షించాలని వీరపునాయునిపల్లె మండల వైద్యాధికారి మహమ్మద్ తాహ డిమాండ్ చేశారు. శనివారం దాడికి నిరసనగా వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు హింసాత్మక చర్యలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్‌యమ్‌లు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యులు, నర్సింగ్ కాలేజి విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం కల్‌కత్తాలోజరిగిన ఘటనకు నిరసనగా పట్టణంలోభారీ ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఐ క్యాంబెల్ ఆసుపత్రి సూపరిండెంటెంట్ అగస్టీన్‌రాజు, ప్రభుత్వాసుపత్రి సూపరిండెంటెంట్ రఫిక్‌పాషా, వైద్యులు కిరణ్‌కుమార్, హరి కృష్ణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ..

ఎర్రగుంట్ల : కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం ఉదదంతంపై శనివారం యర్రగుంట్ల పట్టణ పీహెచ్‌సీ డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఓబులేసు, లక్ష్మిదేవి, ఎంపీహెచ్‌ఓ రవిశంకర్‌రాజులతో పాటు సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అమానుషంగా ప్రవర్తించి హత్యకు కారకులైన వారిని కఠినగా శిక్షించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. వైద్యాధికారులు డా.కరిష్మా, డా.శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందుల రూరల్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సూపరింటెండెంట్ తదితరులు



ఎర్రగుంట్ల : యర్రగుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యుల బృందం



వీరపునాయునిపల్లె మూడు రోడ్లకూడలిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



కమలాపురంలో సీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది



వల్లూరులో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ఫుడ్‌సైన్స్ కళాశాల పురోగతికి సహకరించాలి



బదిలీపై వెళ్తున్న డీన్ ఎంఎస్ బేగ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

పులివెందుల టౌన్ : పులివెందుల ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల పురోగతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కళాశాల అసోసియేట్ డీన్ ఎమ్‌ఎస్ బేగ్ పేర్కొన్నారు. శనివారం డీన్ ఎమ్‌ఎస్ బేగ్ బదిలీ అయిన సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేట్ డీన్‌గా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కళాశాలలో మంచి వసతులు ఉన్నాయని, నూతన అసోసియేట్ డీన్‌కు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రుద్రూర్ ఆహార విజాన సాంకేతిక కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పద్మావతి, కళాశాల పరిపాలనాధికారి అజ్మతుల్లా, అధ్యాపకులు అరుణ, జయమ్మ, రాజేష్, కీర్తిరెడ్డి, నజ్మా, నివేదిత, సాయి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయాలి



మాట్లాడుతున్న ఏఎంఓ రామానుజులరెడ్డి

కమలాపురం : విద్యార్థుల్లో గల నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా సర్వశిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) రామానుజులరెడ్డి తెలిపారు. శనివారం పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన సందర్శించారు. సమావేశంలో వివిధ అంశాలపై జరుగుతున్న చర్చలపై ఆరా తీశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. టెన్త్‌లో 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు బేబి, సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి భద్రత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో ఎక్కువగా వరుస చోరీలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ప్రజలు ఎక్కడైనా దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. వివరాలకు ఎస్సై 9121100546, సీఐ 9121100544, డీఎస్పీ 9121100545 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏపీ హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన మండలి, చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని తెలిపారు. ముందుగా లక్షణాలు గుర్తించి, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే ఎయిడ్స్ ప్రాణాంతకం కాదన్నారు. ఈ కార్యక్రమంలో శరత్, భారతి, సుమతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విదార్థులకు తిథి భోజనం

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ దాసరి ఆంజనేయులు సోదరుడు శ్రీకర్ తిథి భోజనం ఏర్పాటు చేశారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా తిథి భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవకుమార్, డీలర్ తారక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం



అన్నదానం చేస్తున్న చక్రపాణిరెడ్డి తదితరులు

వేంపల్లె : ప్రజలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని చైర్మన్ చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా గండి వీరాంజనేయస్వామిని దర్శించుకునేందుకు నడక దారిన వెళ్లే భక్తుల కోసం ఉచిత తాగునీరు శిబిరాన్ని మానవత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మండుతున్న ఎండలు తీవ్రంగా ఉండడంతో భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఉచిత తాగునీరు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవత ఉపాధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోతిరెడ్డి శ్రావణ్, రీజనల్ చైర్మెన్ బాలాజీ, డైరెక్టర్ రంగారెడ్డి, ప్రతినిధులు మధు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఏపీడీ



అరటిపంటను పరిశీలిస్తున్న ఎంఐ ఏపీడీ మురళీ మోహన్‌రెడ్డి

లింగాల: లింగాల మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఎంఐ ఏపీడీ మురళీమోహన్ రెడ్డి పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ఇ క్రాప్ నమోదు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల నమోదులపై ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగుచేస్తున్న అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పద్ధతిలోనే 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందిస్తుందని తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు త్వరలో 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఎంఐ ఏఓ మౌలాలి, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జి విక్టోరియా, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య తదితరులు

తొండూరు : వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య అన్నారు. శనివారం తొండూరు మండలం సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గంగాదేవిపల్లెలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అలాగే మురుగు నీటిలో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేసి ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గూన్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ చెత్తాచెదారం మురుగు కాలువల్లో చేరకుండా చూడాలని, మురుగు కాలువల్లో పూడిక తీసి నీరు పారేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నందీశ్వర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త లక్ష్మిదేవి, ఆశాకార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

సింహాద్రిపురం : మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మండలంలోని గురిజాల లోలెవల్ బ్రిడ్జి వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో ఎస్సై తులసి నాగప్రసాద్ వెంటనే వాగు వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. అలాగే పీబీసీ మెయిన్ కాలువ నుంచి తొండూరు డిస్ట్రిబ్యూషన్ వెళ్లే పీబీసీ కాలువ నీటి ప్రవాహానికి గ్రామ సమీపంలో ఉన్న సీసీ వాల్ కొట్టుకుపోయింది. అక్కడ జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పిడుగు శబ్దానికి సింహాద్రిపురం నుంచి గురిజాలకు వచ్చే 33 కేవీ లైన్ ఇన్సులేటర్లు పగిలిపోవడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి. విద్యుత్ ఏఈ సుబ్రమణ్యం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయడంతో విద్యుత్‌ను పునరుద్ధరించారు. మండల వ్యాప్తంగా 50.4 ఎం ఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షం వానాకాలం పంటలకు జీవం పోసినట్లయింది. జొన్న, పత్తి మొలకలు వాడుతున్న దశలో వాన పడి మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెన్నా, చిత్రవతికి వరద



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



యనమలచింతల వద్ద చిత్రవతి నది ప్రవహిస్తున్న దృశ్యం

కొండాపురం : అనంతపురం జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పెన్నా, చిత్రవతి నదులు ప్రవహిస్తున్నాయి. శనివారం పెన్నా, చిత్రవతి వరదతో పాటు కృష్ణా జలాలతో కలిపి గండికోట జలాశయంలో 11,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. గండికోట జలాశయంలో ప్రస్తుతం 7.8 టీఎంసీలు నీరు ఉందని తెలిపారు. పెన్నా, చిత్రవతి ప్రవాహంతో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.